
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 4 సెప్టెంబరు 2025





బొజ్జ గణపయ్య వద్ద 101 నైవేద్యాలు

బొజ్జ గణపయ్యకు 101 నైవేద్యాలు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని ఏబీ విల్లాస్‌లో నెలకొల్పిన బొజ్జ గణపయ్యకు బుధవారం 101 రకాల నైవేద్యాలను సమర్పించారు. మహిళలందరూ కలిసి ఉండ్రాళ్లు, స్వీట్లు, పండ్లు, పిండి వంటలు, గుగ్గిళ్ళు, పులిహోర, పాయసాలను నైవేద్యంగా పెట్టి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహిళలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అభినందించారు.



షాద్‌నగర్ కాలేజ్ రోడ్డులోని లంబోదరుడికి మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పూజలు

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నిమజ్జనం సందర్భంగా చెరువుల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సరూర్‌నగర్‌లోని మినీ ట్యాంక్‌బండ్‌ను జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం బాలాపూర్ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మినీ ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనానికి గణనాథులు భారీ సంఖ్యలో తరలి వస్తాయని, రూట్ మ్యాప్ ఆధారంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని, అవసరమైన చోట బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువుల వద్ద గజఈతగాళ్లను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భక్తులకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, కందుకూరు ఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



బాలాపూర్ గణనాథుడి సన్నిధిలో కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రతి ఇంట్లో ఎల్ఐసీ పాలసీ

- పైలెట్ ప్రాజెక్ట్‌గా కేశంపేట మండలం ఎంపిక
- తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక మండలం
- ప్రజలకు బీమా, గ్రామాభివృద్ధికి నిధులు
- క్లియ ఈడీ పీసీ పైక్రే వెల్లడి



మాట్లాడుతున్న క్లియా ఈడీ పీసీ పైక్రే

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): భారతీయ జీవిత బీమా సంస్థ ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న ప్రతి ఇంట్లో ఒక ఎల్ఐసీ పాలసీ కోసం పైలెట్ ప్రాజెక్ట్‌గా కేశంపేట మండలాన్ని ఎంపిక చేసిందని క్లియా ఈడీ పీసీ పైక్రే వెల్లడించారు. ఎల్ఐసీ జడ్చర్ల, షాద్‌నగర్ శాటిలైట్‌శాఖ పరిధిలో పనిచేస్తున్న అభివృద్ధి అధికారులు, క్లియా, ఏజెంట్లు, బీమా సఖీల సమావేశాన్ని బుధవారం జడ్చర్లలో నిర్వహించారు. బ్రాంచ్ ఆఫీసులో నిర్వహించిన సమావేశానికి ప్రప్రథమంగా హాజరైన పైక్రే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ఎల్ఐసీ జోన్లలో 16 ప్రాంతాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద తీసుకుందని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లోనే కేశంపేటను ఏకైక మండలంగా ఎంపిక చేసిందని తెలిపారు. 2026 మార్చి 31నాటికి కేశంపేట మండలంలోని 29 పంచాయతీలలో ప్రతీ ఇంటికి కనీసం ఒక పాలసీ ఇచ్చి, బీమా గ్రామాలుగా, బీమా పాఠశాలలుగా ఎంపిక చేయాలని సూచించారు. బీమా గ్రామాలకు 30వేల నుంచి లక్ష రూపాయలను, బీమా పాఠశాలకు పది వేల నుంచి లక్ష రూపాయలను ఎల్ఐసీ ఇస్తుందని వెల్లడించారు. పైలెట్ ప్రాజెక్ట్‌ను విజయవంతం చేస్తే ప్రతి కుటుంబానికి బీమా రక్షణ, ఆర్థిక భరోసాను కల్పిస్తూ.. గ్రామాల, పాఠశాలల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందుతుందని పైక్రే వెల్లడించారు. ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ మాట్లాడుతూ 2047 నాటికి దేశంలోని ప్రతీ వ్యక్తికి బీమా రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో కేశంపేట మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారని తెలిపారు. అవసరమైన గ్రామాల్లో బీమా సఖీలను నియమించి, ఇంటింటికి కనీసం ఒక పాలసీని చేయించి ఎల్ఐసీ తీసుకున్న నిర్ణయాన్ని విజయవంతం చేయాలని కోరారు. క్లియా ఆర్ఎం రాజశేఖర్ మాట్లాడుతూ కేశంపేట మండలానికి దక్కిన అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేస్తే ఆ మండలంలోని ప్రజలు ఆర్థికంగా ఎదుగుతారని, గ్రామాల అభివృద్ధికి సహకారం అందుతుందని తెలిపారు. క్లియా మేనేజర్ రవిశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్‌రావు, కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, బీఎస్ బీడీ జగన్నాథ్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శంకర్, బ్రాంచ్ మేనేజర్ ఫణిభూషన్, ఏబీఎం రవీంద్రనాయక్, డీవోలు, క్లియాలు హాజరైనారు.



పాతాళగంగ పైపైకి..

- భారీ వర్షాలతో నిండిన చెరువులు, కుంటలు
- ఒక్క నెలలో 4.31 మీటర్ల భూగర్భజలాలు పెరుగుదల
- వానాకాలం తోపాటు యాసంగి సాగుకి ధోకా లేనట్లే..

జిల్లా వ్యాప్తంగా 20 రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెరువులు నిండాయి. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. జలాశయాలన్నీ నిండుకుండలా మారాయి. ఈ కారణంగా గంగమ్మ పైపైకి చేరింది. దీంతో సగటు భూగర్భజలాలు 7.43 మీటర్లకు చేరాయి. ఆగస్టు మాసంలో విస్తారంగా వర్షాలు కురవడంతో ఒక్క నెలలోనే రికార్డుస్థాయిలో భూగర్భ జలాలు సగటు 4.31 మీటర్ల మేర పెరగడం విశేషం. ఇంతకు ముందెన్నడూ ఒక్క నెలలో ఈ స్థాయిలో భూగర్భ జలాలు పెరిగిన దాఖలాలు లేవు. భూగర్భజలాలు గణనీయంగా పెరగడంతో రైతులు సంతోషపడుతున్నారు.

సగటు 7.43 మీటర్లకు చేరిన భూగర్భ జలాలు

మూడు నెలలుగా భూగర్భజలాల పరిస్థితి (మీటర్లలో)

జిల్లా	జూన్	జులై	ఆగస్టు
రంగారెడ్డి	13.09	11.74	7.43



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : జిల్లాలో భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో ప్రస్తుత వానాకాలం (ఖరీఫ్) సీజన్ తోపాటు యాసంగి (రబీ) సాగుకు కూడా ఢోకా ఉండదని అధికారులు చెబుతున్నారు. వానాకాలం సీజన్‌లో ఇప్పటికే దాదాపు 75శాతం విస్తీర్ణంలో రైతులు పంటలు వేశారు. వర్షాలు కొంత తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ పనులు మళ్లీ ఊపందుకున్నాయి. దీంతో వారం, పది రోజుల్లో పంటల సాగు విస్తీర్ణం 100 శాతానికి చేరవచ్చని భావిస్తున్నారు. అలాగే వచ్చే యాసంగిలో పంటల సాగు విస్తీర్ణం గత ఏడాది కంటే మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి జూన్‌లో వర్షాలు అంతంత మాత్రంగానే పడడంతో

మిగతా 8వ పేజీలో...

3.1 కిలోల గంజాయి పట్టివేత

- రూ. 3 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు
- బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వస్తున్న మహిళా ప్రయాణికురాలి వద్ద లభ్యం

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరోసారి భారీగా గంజాయిని పట్టుకున్న సంఘటన బుధవారం జరిగింది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ ప్రయాణికురాలు సోమవారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుంది. విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు బ్యాగులు తనిఖీలు చేయగా 3.1 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించిన కస్టమ్స్ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలిని కస్టమ్స్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టుబడ్డ గంజాయి విలువ దాదాపు రూ. 3 కోట్లు ఉంటోందని అంచన వేశారు అధికారులు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో
ఈ-శ్రమ్ శిబిరం 7

యూరియా కొరత..
రైతుల వ్యధ 7
- పీఏసీఎస్‌ల వద్ద బారులు
- గంటల తరబడి పడిగాపులు
- ఒక్క బస్తా దొరకని వైనం

ఆ భూమిని జీపీ భవనానికి కేటాయించాలి

- క్రిస్టియన్ శ్మశానవాటికకు ప్రభుత్వ భూమి ఇవ్వడంపై కన్నెర్ర
- వెంటనే రద్దు చేయాలని తండావాసుల డిమాండ్
- భూమి విలువ దాదాపు రూ.5కోట్లు



కొడిచర్లతండాలో శ్మశానవాటికకు కేటాయించిన ప్రభుత్వ భూమి

కొత్తూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని క్రిస్టియన్ శ్మశాన వాటికకు కేటాయించడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 5 కోట్ల రూపాయల విలువైన భూమిని ఎలాంటి సమాచారం లేకుండా అలా ఎలా చేస్తారని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కొడిచర్లతండా గ్రామపంచాయతీలోని సర్వే నెంబర్ 198లో రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 2019 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు ఆ రెండున్నర ఎకరాల భూమిని క్రిస్టియన్ శ్మశానవాటికకు కేటాయించారు. అయితే ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. తండావాసులకు సమాచారం లేకుండా

మిగతా 8వ పేజీలో...

వెంటనే రద్దు చేయాలి



క్రిస్టియన్ శ్మశాన వాటికకు కేటాయించిన భూమిని వెంటనే రద్దు చేసి, గ్రామపంచాయతీ భవనానికి కేటాయించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు, తండావాసులకు తెలియకుండా ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారు. గ్రామపంచాయతీ భవనం లేక తండావాసులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి.

బి.రవీందర్‌రెడ్డి,
మాజీ ఎంపీటీసీ, కొడిచర్ల

కాళేశ్వరం అక్రమాలకు కవితే సాక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం అక్రమాలకు మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత ఆధారమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేపడుతున్నారని తెలిపారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను తప్పుపడుతూ ఆ పార్టీ అధినేతలు కోర్టును ఆశ్రయించారని, ఏ తప్పు చేయకుంటే ఆందోళనలు, కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కేసీఆర్ కూతురు కవిత వాస్తవాలను వెలుగులోకి తేవడంతో ఆ పార్టీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెట్టి ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరిట చేసిన ఆర్థిక విధ్వంసాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తుంటే ఉల్టాచోర్ కొత్వాల్ అంటూ సీఎం దిష్టిబొమ్మలను దహనం చేయడం దుర్మార్గమన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు కేటాయించిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ నిధులతో అన్ని మండలాల్లో అంగన్‌వాడీ భవనాలు, రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. టీయూఎఫ్‌డీసీ ద్వారా మంజూరైన రూ.2.16కోట్లతో షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 16,18 వార్డులలో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బస్వం, పురుషోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే..



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న

ఆమనగల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న కోరారు. ఆమనగల్లు మండల పరిషత్ ఆవరణలో బుధవారం మండల మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని కోరారు. కార్మికులకు ఉచితంగా వంట గ్యాస్ అందించాలని, బీమా సదుపాయం కల్పించాలని, అన్ని పాఠశాలల్లో వంట గదులు నిర్మించాలని కోరారు. ప్రభుత్వ హామీలు అమలు చేసి పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆమనగల్లు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా పద్మ, అధ్యక్షురాలిగా రజియాబేగం, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలు ఇందిరమ్మ, జోగమ్మ, సహాయ కార్యదర్శిగా పార్వతమ్మ, ఎల్లమ్మ, సభ్యులుగా సుగుణమ్మ, పుల్లమ్మ, సఫియా బేగం, సీపీఎం మండల కన్వీనర్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిభట్ల ఇసుక బజార్ వద్ద లారీల క్యూ

'ఇసుక బజార్'కు డిమాండ్

ఆదిభట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమాలను అరికట్టాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు చేసిన ఇసుక బజార్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని సర్వేనంబర్ 44లో గత ఏప్రిల్ నెలలో ఇసుక బజార్‌ను ప్రారంభించారు. మొదట్లో స్పందన అంతంత మాత్రంగా ఉన్నా ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. నెలరోజుల క్రితం భారీ వర్షాలు కురవడంతో రాష్ట్రంలో ఇసుక కొరత ఏర్పడింది. దీంతో కాళేశ్వరం, భద్రాచలం నుంచి ఇసుక రావడం లేదు. కాగా ఏప్రిల్ నెలలో ఆదిభట్లలో 89వేల టన్నులతో ఇసుక బజార్ ఏర్పాటు చేశారు. పక్షం రోజుల్లోనే 45వేల టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయి. బుధవారం ఒక్కరోజు 80పైగా లారీలు ఇసుక బజార్ వద్ద క్యూ కట్టాయి.



ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌.. తెలంగాణ బాలికలు, బాలుర విజయం


బహుమతులు అందుకుంటున్న తెలంగాణ క్రీడాకారులు

నందిగామ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హాశాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు దూసుకుపోతున్నారు. సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్‌నికోబార్ జట్లు పాల్గొన్నాయి. మంగళ, బుధవారాల్లో జరిగిన పోటీల్లో తెలంగాణ జూనియర్ గర్ల్స్, జూనియర్ బాయ్స్ గెలిచారు. సీనియర్ ఉమెన్, మెన్ తృతీయ స్థానంలో నిలిచారు. ఏపీ సీనియర్ ఉమెన్ రన్నర్స్‌గా, సీనియర్ మెన్ మూడో స్థానంలో నిలిచారు. కర్ణాటక జట్లు జూనియర్ గర్ల్స్ మూడో స్థానం, జూనియర్ బాయ్స్ రన్నర్స్‌గా, సీనియర్ ఉమెన్ విన్నర్స్‌గా నిలిచారు. తమిళనాడు జట్లు జూనియర్ గర్ల్స్ రన్నర్స్‌గా, బాయ్స్ మూడో స్థానం, సీనియర్ ఉమెన్ మూడో స్థానం, సీనియర్ మెన్ విన్నర్స్‌గా నిలిచారు. కేరళ జట్టు జూనియర్ గర్ల్స్, జూనియర్ బాయ్స్ మూడో స్థానంలో నిలిచారని నిర్వాహకులు తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవంలో జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రతీ కుటుంబానికి మేలు


తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలం టాక్‌రాజ్‌గూడ, మైసిగండిలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. టాక్‌రాజ్‌గూడలో రూ.5లక్షలతో నిర్మించే తాగునీటి పైపులైన్ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మైసిగండిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు పైపులైన్లు, వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు వేస్తూ రవాణ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదలకు సొంతిల్లు సాకారమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. పేదల ప్రగతిని జీర్ణించుకోలేని విపక్షాలు ప్రతీది రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా మారాయని మండిపడ్డారు. అవకాశ వాద బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు విశ్వసించరని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. టాక్‌రాజ్‌గూడలో ఇళ్లపైనుంచి ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాలని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, బల్‌రామ్, అధికారులు, నాయకులు బిచ్యా, బిక్యా, వెంకటేశ్, పర్వతాలు, అశోక్, షాబుద్దీన్, అజీమ్, హరిచంద్, జగన్, శ్రీరాములు, కోట్య, శ్రీను, నరేందర్, కేశవులు, లక్పతి, హన్మ, నరేశ్ పాల్గొన్నారు.

నిరసన.. కేంద్ర ప్రభుత్వంపై చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కడ్తాల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసమే బీజేపీ నాయకులు కల్వకుర్తి నియోజకవర్గంలో నిరసన దీక్షలు చేస్తున్నారని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. బీజేపీ నాయకులు రాష్ట్రానికి రావాల్సిన నిధులు, యూరియా కేటాయింపులు, అమలు చేయని హామీలు,బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రం ప్రభుత్వంపై ఢిల్లీలో నిరసన దీక్షలు చేయాలన్నారు. కడ్తాలలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు బీజేపీ నాయకులకు కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్రం ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. బీజేపీ అబద్ధాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. అభివృద్ధి అడ్డుకునేలా వారు కుట్ర చేస్తూ దీక్షల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవి, నాయకులు లక్పతి, మల్లేశ్‌గౌడ్, సత్యం, శ్రీను, వినోద్, జవహర్‌లాల్, తులసీరామ్ పాల్గొన్నారు.

కొడంగల్ ప్రాంత అభివృద్ధే ధ్యేయం


కొడంగల్‌లో షాదీఖానా నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి, అధికారులు, నాయకులు

కొడంగల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వెనకబడిన కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లోని తాండూర్ రోడ్డులో షాదీఖానా నిర్మాణానికి రూ.2.5కోట్లతో శంకుస్థాపన చేసి మాట్లాడారు. మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటుతో విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గతంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ హయాంలో చేపట్టిన షాదీఖానా శిథిలావస్థకు చేరడంతో నూతన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో డబ్బాలు పోయిన వారికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, త హసీల్దార్ దీపక్ శ్యామ్సన్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, యూసుఫ్, ఎన్.ప్రశాంత్, నయీమ్, ఆసిఫ్‌ఖాన్, నర్సిములు, హమీద్, అశ్వక్, సిరాజ్, సీపీఐ బషీర్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: చౌదర్‌పల్లిలో రూ.1.6 కోట్లతో యూజీడీ నిర్మాణానికి తిరుపతిరెడ్డి, అధికారులు శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీని ప్రారంభించారు. నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్, అంజిల్‌రెడ్డి, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మంత్రి రాము

పరిగి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మంత్రి రాము అన్నారు. బుధవారం పరిగిలోని జరిగి బీకేఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. చాలా మంది రైతులకు రుణమాఫీ, రైతుభరోసా అందడం లేదన్నారు. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి, మల్లారెడ్డి, సుబ్బారెడ్డి, సుభాష్‌చందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నాయకులు రైతు సమస్యలపై ఏడీఏకు వినతి పత్రం ఇచ్చారు.


















ఎయిర్ పోర్టులో ఈ-శ్రమ్ శిబిరం



ఈశ్రమ్ శిబిరంలో పాల్గొన్న క్యాబ్ డ్రైవర్లు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం బుధవారం ఈ-శ్రమ్ నమోదు శిబిరాన్ని నిర్వహించారు. టీజీపీడబ్ల్యూయూ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ.. దత్తోపంత్ తేంగడి నేషనల్ బోర్డ్ ఫర్ వర్కర్స్ ఎడ్యూకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ కలిసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. డీటీఎన్‌బీడబ్ల్యూ ఈడీ హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టర్ ఎంఆర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. దేశంలోని రద్దీ విమానాశ్రయాల్లో శంషాబాద్ విమానాశ్రయం ఒకటని, అందుకే కార్మిక సంక్షేమానికి ప్లాట్‌ఫాం కృషి చేస్తోందని చెప్పారు. ఈ శ్రమ్ ద్వారా గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్ల భవిష్యత్ రక్షణ కలిగించే ప్రభుత్వ పథకాలతో అనుసంధానమవుతారన్నారు. ఈ శిబిరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5 వరకు కొనసాగుతోందన్నారు.

బీఆర్ఎస్‌ను నాశనం చేస్తున్న కవిత


పట్లోళ్ల కృష్ణారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కవిత బీఆర్ఎస్ పార్టీని సర్వ నాశనం చేస్తోందని, బీఆర్ఎస్ ఓటమికి ఆమే కారణమని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కవిత బీఆర్ఎస్‌ను వీడినా నష్టం ఏమీ లేదన్నారు. 60లక్షల మంది సభ్యత్వం ఉన్న బీఆర్ఎస్‌పై బురద జల్లుతే ఊరుకోం అని హెచ్చరించారు. లిక్కర్ కేసులో ఆమె జైలుకు వెళ్లేముందు ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కవితకు ఎంపీగా, ఎమ్మెల్సీగా అవకాశాలు కల్పించిందన్నారు. లిక్కర్ కేసుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కవితను బ్లాక్ మెయిల్ చేస్తున్నాయని, ఈ విషయాన్ని ఆమె చెప్పలేక పోతోందన్నారు. కవిత కేసీఆర్ కూతురు, కేటీఆర్ చెల్లె కావడంతోనే బీఆర్ఎస్‌పై ఆమె చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై మహిళలు ఏమీ అనడం లేదని తెలిపారు. ప్రెస్‌మీట్ పెట్టి కవిత విలువ పోగొట్టుకుందని విమర్శించారు.

కాలువలో కారు బోల్తా

● బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నితీష్‌రెడ్డి దుర్మరణం


కారు బోల్తాపడి మృతిచెందిన నాయకుడు నితీష్‌రెడ్డి



చేవెళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అతి వేగం, అజాగ్రత్తగా కారు డ్రైవ్ చేస్తూ కల్వర్టు వద్ద కాలువలో పడి బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మృతిచెందిన సంఘటన చేవెళ్లలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లకు చెందిన గుడిపల్లి నితీష్‌రెడ్డి (27) బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. పని నిమిత్తం మంగళవారం అర్ధరాత్రి చేవెళ్ల నుంచి పామెన కారులో వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కాలువలో బోల్తాపడింది. దీంతో నితీష్‌రెడ్డి కారులో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అర్ధరాత్రి కావడంతో ప్రమాదాన్ని ఎవరూ గమనించలేదు. బుధవారం ఉదయం రైతులు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకొని క్రేన్‌తో నితీష్‌రెడ్డి, కారును వెలికి తీశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. నితీష్‌రెడ్డి తల్లి గతంలోనే చనిపోగా తండ్రి కొన్ని నెలల క్రితం చనిపోయాడు. అతడికి భార్య ఉంది. నితీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నివాళులు అర్పించిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

కారు బోల్తాపడి మృతిచెందిన నితీష్‌రెడ్డి మృతదేహానికి బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపాల్ అధ్యక్షుడు అనంతరెడ్డి తదితరులు నితీష్‌రెడ్డి మృతదేహానికి పూలువేసి ఘనంగానివాళ్లు అర్పించారు. అతడి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

వినూత్న విఘ్నేశులకు పురస్కారాలు


స్వర్ణగిరి విఘ్నరాజ మండప నిర్వాహకుడు సాయిప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న సంస్కార భారతి సభ్యులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా మండపాలను ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో నిత్యపూజలు చేస్తున్న మండప నిర్వాహకులకు సంస్కార భారతి పురస్కారాలను అందజేసింది. షాద్‌నగర్‌లోని గణేష్ పండపాలను మంగళవారం రాత్రి సంస్కార భారతి, జాతీయ సాంస్కృతిక సేవా సంస్థ, తెలుగు రుచులు షాద్‌నగర్ శాఖ ప్రతినిధులు పరిశీలించారు. పద్మావతి కాలనీలోని వివేకానంద సేవా సమితి నెలకొల్పిన స్వర్ణగిరి వినాయకుడు, విజయనగర్ కాలనీలోని దోస్తానీ గణేష్, వినాయకగంజ్‌లోని వినాయక మండలి విఘ్నేశ్వరుడు, క్రిస్టియన్ కాలనీ టీమ్ ఎస్‌వీఎస్ గణనాథుడు, పటేల్‌రోడ్‌లోని బాల గణేష్‌డులను ఎంపిక చేసి నిర్వాహకులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. నిత్య పూజలే కాకుండా నిష్ఠతో నిమజ్జనాన్ని కూడా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల ప్రతినిధులు బెజుగం రమేష్, టీవీ రంగయ్య, కె.రంగనాథం, ఎస్.రవీందర్, శివ, రమేష్, స్వాతిరెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాల్ని అమలు చేస్తున్న కేంద్రం

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాల్ని అమలుచేయడం నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. బుధవారం మండల కన్వీనర్ బాల్‌రాజ్ అధ్యక్షతన కందుకూరులోని సీతారామశాస్త్రి కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో శ్రామిక మహిళ యూనియన్ జిల్లా కన్వీనర్ జి.కవితతో కలిసి పాల్గొని చంద్రమోహన్ మాట్లాడారు. కార్పొరేట్ల కొమ్ము కాలసేలా కేంద్రం పనిచేస్తుందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. సమావేశంలో నేదునూరుకు చెందిన సీపీఎం నాయకుడు శ్రీనివాస్‌ను సీఐటీయూ మండల కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమార్, శ్రీలత, సరస్వతి, సత్తయ్య, పి.శ్రీరాములు, కె.శ్రీనివాస్, నరసింహ, లక్ష్మణ్, సాయిలు, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

రుణమాఫీ కోసం కృషి చేయాలని ఎంపీకి వినతి


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, వివిధ పార్టీల నాయకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండలంలో రైతులకు రుణమాఫీ జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు, వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌లను కలిసి వినతి పత్రాలు అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే, ఎంపీ నివాసాలకు వెళ్లి వారిని కలిసి సమస్యను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు గడుస్తున్నా మండలంలోని 1,189 మంది రైతులకు నేటికీ రుణమాఫీ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల్లో అప్పులున్న రైతులపై వడ్డీభారం పడుతోందన్నారు. ఈ సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని ఎమ్మెల్యే, ఎంపీలను కోరారు. కార్యక్రమంలో రైతులు, పార్టీల నాయకులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి ఆర్యవైశ్య మహాసభ చేయూత


సమావేశంలో మాట్లాడుతున్న అమరవాది లక్ష్మీనారాయణ

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదల విద్యాభివృద్ధికి ఆర్య వైశ్య మహాసభ చేయూతనిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణగుప్తా తెలిపారు. షాద్‌నగర్ టీటీడీ కల్యాణ మం డపంలో బుధవారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు గందె సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీ సేవా ప్రముఖ్ రమేష్, గణేష్‌గుప్తా, రవికుమార్, గోపాల్, లక్ష్మయ్యరమాదేవి, రమేష్, శ్రీనివాస్‌గుప్తా, నారాయణ పాల్గొన్నారు.

యూరియా కొరత.. రైతుల వ్యథ

బారులు తీరుతున్న అన్నదాతలు | ఒక్క బస్తా అయినా దొరకని వైనం


కొందుర్గులో యూరియా కోసం బారులు తీరిన రైతులు


యాలాలలో లారీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు


యూరియా కోసం యాచారం సొసైటీ వద్ద లైన్ కట్టిన రైతులు

యాచారం/కొందుర్గు/యాలాల/పెద్దేముల్/దారూరు/మంచాల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): యూరియా డిమాండ్ రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రాథమిక సహకార సంఘాలు, ఫెర్టిలైజర్ షాపుల వద్ద ఉదయం నుంచే రైతులు పడిగాపులు కాస్తున్నారు. వస్తున్న ఒకటీ అరా లోడ్లు రైతులకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా అయినా దొరకని పరిస్థితి తలెత్తుతోంది. టోకెన్లు ఇచ్చి పోలీసుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేస్తున్నారు. బుధవారం యాచారంలో రైతులు ఉదయమే సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు. యూరియా లేదని తెలిసి నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై రాస్తారోకోకు సిద్ధమవగా సొసైటీ సీఈవో నాగరాజు, మహేష్, ఇన్‌స్పెక్టర్ ఎ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సైలు సత్యనారాయణ, ప్రియాంకలు పది గంటలకల్లా యూరియా ఇస్తామని హామీ ఇచ్చారు. యూరియా లారీ రాగానే ఇన్‌స్పెక్టర్ ఒక్కో రైతుకు ఒక్క బస్తాకు స్లిప్‌లు పంపిణీ చేశారు. 450 మంది రైతులకు బస్తా చొప్పున ఇచ్చారు. అందరికీ సరిపడినంత యూరియా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఉమ్మడి కొందుర్గు మండలంలో సొసైటీ వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇక్కడికి రోజుకు 450 బస్తాల యూరియా మాత్రమే వస్తోంది. యూరియా కోసం పెద్దఎత్తున వస్తుండడంతో ఆధార్ లింక్‌తో ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇస్తున్నారు. ఒకేసారి ఐదు బస్తాలు ఇవ్వాలని రైతులు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. కాగా ఏవో సురేష్‌రెడ్డి రైతులతో మాట్లాడుతూ.. యూరియా అధికంగా వాడితే పంటలకు రోగాలెక్కువ వచ్చి దిగుబడి తగ్గుతుందని, పెట్టుబడి పెరుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం డౌన్‌డౌన్.. సొసైటీ, వ్యవసాయాధికారులు డౌన్‌డౌన్ అంటూ యాలాల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. యాలాల, బషీరాబాద్ మండలాలకు లారీ లోడ్ యూరియా యాలాల సొసైటీకి వచ్చింది. అప్పటికే 400మంది వరకు రైతులు అక్కడికి చేరుకున్నారు. యూరియా సరిపోదని అధికారులు పంపిణీ నిలిపారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య చేరుకుని రైతులతో మాట్లాడారు. బషీరాబాద్ మండల 225 బస్తాల యూరియాను కూడా యాలాల రైతులకే ఇవ్వాలని ఆందోళన చేశారు. చివరకు ఉన్నంత మట్టుకు పంపిణీ చేశారు. యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలమైందని ముకుందాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. పెద్దేముల్ సొసైటీకి బుధవారం 220 బస్తాల యూరియా వచ్చింది. రైతులంతా ఒకేసారి రావడంతో అధికారులు, సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉన్న విషయాన్ని రైతులకు వివరించారు. రెండురోజులుగా యూరియా దొరకలేదని, ఈ రోజైనా ఇవ్వకుంటే ఊరుకోం అని భీష్మించారు. సొసైటీ మేనేజర్ పోలీసులకు తెలపడంతో ఎస్ఐ.వేణుకుమార్ చేరుకుని రైతులను సముదాయించారు. ఉన్న యూరియా సరిపోదని అధికారులు సొసైటీకి తాళం వేసుకుపోయారు. రెండురోజుల్లో మరో లోడ్ వస్తుందని, అప్పుడే పంపిణీ చేస్తామన్నారు. దీంతో రైతులు మధ్యాహ్నం వరకు వేచిచూసి వెళ్లిపోయారు. ధారూరు మన గ్రోమోర్ వద్ద రైతులు క్యూ కట్టారు. రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. పట్టాదారు వేలి ముద్రలు లేని వారికి యూరియా ఇవ్వలేదు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశాడు. బుధవారం మంచాలలో పాక్స్ వద్ద చేపట్టిన ధర్నాలో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఆందోళనలో నాయకులు, రైతులు కె.శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, జంగయ్య, లెనిన్, బి.సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రవిరాజ్, వినోద్, బాల్‌రాజ్, ఐలయ్య, మాధవరెడ్డి, శివప్రసాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ధారూరులోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద గుమిగూడిన రైతులు


పెద్దేముల్ సొసైటీ వద్దకు భారీ సంఖ్యలో వచ్చిన రైతులు


షాబాద్‌లో యూరియా కోసం లైన్‌లో నిల్చున్న రైతులు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

● జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్



రైతులకు ఒప్పంద పత్రాలు అందిస్తున్న సురేశ్

ఆమనగల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చుని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్ అన్నారు. తక్కువ నీరు, స్వల్ప పెట్టుబడితో అధిక లాభాలు పొందే ఉద్యాన, ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి రైతు వేదికలో బుధవారం ఉద్యానవ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. డివిజన్ ఉద్యానవన అధికారి సౌమ్య అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు జిల్లా అధికారి సురేశ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆయిల్‌పామ్ ఏరియా మేనేజర్ ప్రమోద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అయిల్‌పామ్ సాగు విధానం, లాభాలు, మార్కెటింగ్, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం తదితర విషయాల గురించి అధికారులు వివరించారు. సురేశ్ మాట్లాడుతూ అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రోత్సాకం అందిస్తుందని తెలిపారు. మొక్కలకు 90 శాతం రాయితీ, డ్రిప్‌కు 80 నుంచి 100 శాతం రాయితీతో పాటు మొక్కలు నాటిన 4 సంవత్సరాల వరకు ఎకరానికి రూ.4200 మెయింటెనెన్స్ కింద అందిస్తుందని తెలిపారు. ఈ పంటకు దళారీ వ్యవస్థ లేదని, ఆయిల్‌పామ్ చట్టం-1993 ప్రకారం రైతులకు పంట అమ్ముకోవడంలో రక్షణ కల్పిస్తుందన్నారు. రంగారెడ్డి జిల్లాకు ప్రభుత్వం వాల్యూ ఆయిల్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుందని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కంపెనీ పంట కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ పంట వేసిన రైతులకు వాల్యూ ఆయిల్ కంపెనీ కొనుగోలు ఒప్పంద పత్రాలను అందజేశారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఈవో శ్రవణ్‌కుమార్, ఏఈవో భూదేవి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి ..

విద్యుత్ షాక్‌తో బ్యాంకు ఉద్యోగి మృతి


సురేశ్(ఫైల్)

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో ఓ బ్యాంకు ఉద్యోగి కరెంట్‌షాక్ తగిలి మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ కింది బస్తీ పోచమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా బుధవారం రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు విద్యుత్ స్తంభాకు ఉట్టి కట్టి దానిని కొట్టే క్రమంలో ఓ స్తంభం విద్యుత్ తీగ తెగి పడింది. దీంతో ఉట్టి కొడుతున్న బ్యాంకు ఉద్యోగి సురేశ్(30) కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే సురేశ్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అతడు అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

చేవెళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డువేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం మండల పరిధి కమ్మెటలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 217 నుంచి అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు తమ వెంచర్లలోకి వేసిన రోడ్డును రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగింపజేశారు. ప్రభుత్వ భూమి చుట్టూ కాలువ తీయించారు. ప్రభుత్వ భూముల నుంచి దౌర్జన్యంగా రోడ్డువేస్తే కేసులు నమోదు చేయిస్తామని, అసైన్డ్ భూములు పొందిన రైతులు ఇతరులకు అమ్మితే పీవోటీ చట్టం ప్రకారం స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ అన్నారు. ఆర్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కాలం చెల్లిన పార్టీలు : సబితారెడ్డి


పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలో కాలం చెల్లిన పార్టీలుగా బీజేపీ, కాంగ్రెస్‌లు మిగిలాయని, హామీల అమలులో ఈ ప్రభుత్వాలు విఫలమయ్యాయని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. బుధవారం నాగారానికి చెందిన 40మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించి ఎమ్మెల్యే మాట్లాడారు. మహేశ్వరం బీఆర్ఎస్ అడ్డా అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను, రైతులను మోసం చేసింది చాలదన్నట్లు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్న కాంగ్రెస్ భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అడ్డుపడుతున్న కొందరు కాంగ్రెస్ నాయకుల ఆటలు సాగవని, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామన్నారు. ఎవరికి ఆపదొచ్చినా పరిష్కరించేందుకు తాను ఉంటానన్నారు. మహేశ్వరంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో గెలవాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ముడిమ్యాల్ మాజీ సర్పంచ్ స్వర్ణలతదర్శన్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆమె మాట్లాడుతూ... జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలని సూచించారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, వెంకటేశ్, శివకుమార్, గోపమ్మజహిదాబీ, రవీందర్, మోహన్‌రెడ్డి, సుజాత ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

శామీర్‌పేట, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అధికారులను, అంగన్‌వాడీ టీచర్లను, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేటలోని హెచ్‌బీఎల్ భగీరథ్ బాలల వికాస కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ బాలల వికాస కేంద్రానికి నిత్యం ఎంతమంది పిల్లలు హాజరవుతున్నారని కేంద్రం టీచర్లను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారా? అని అడిగారు. అంగన్‌వాడీ కేంద్రంలో తాగు నీరు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, మెయింటనెన్స్ బాగున్నాయని అంగన్‌వాడీలను మెచ్చుకున్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని బడికి తీసుకవచ్చేలా కృషిచేయాలని టీచర్లకు సూచించారు. కేంద్రానికి వచ్చే వారికి ఆట వస్తువులను అందజేస్తూ ఆటల ద్వారా బోధన అందించేందుకు శ్రద్ధ చూపాలన్నారు. రోజూ కొత్త ఆట, పాటలతో పిల్లలను ఆకట్టుకుంటూకేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుచూ వారికి పౌష్టికాహారాన్ని అందించాలని టీచర్లకు, సిబ్బందికి సూచించారు. పుట్టిన రోజు ఉన్న అంన్‌వాడీ చిన్నారులను అదనపు కలెక్టర్ అభినందిస్తు కేంద్రంలో బొమ్మలను కానుకగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌బీఎల్ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నారులతో ముచ్చటిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మంత్రి వివేక్‌కు ఘన సన్మానం


మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

పరిగి,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్‌స్వామిని బుధవారం పరిగిలో నాయకులు కలిశారు. మంత్రి దుద్యాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో సుల్తాన్‌పూర్‌లో క్యూవైఏ గార్డెన్‌కు వచ్చారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటయ్య ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు.రోస్టర్ విధానంలో, ప్రమోషన్లు, ఎస్సీ, ఎస్టీ అడెక్వసీతో మాలలకు జరిగిన అన్యాయంపై వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంతు, శివరాజు, వెంకటయ్య, రాములు, శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహులు, అనితయాదయ్య పాల్గొన్నారు.

యువతే ఆవిష్కరణలకు వెన్నెముక


ఆవిష్కరణలను పరిశీలిస్తున్న జానయ్య

మొయినాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనలతో ముందుకుసాగే యువత ఆవిష్కరణలకు వెన్నెముక అని పీజేటీఎస్ఏయూ వైస్ చాన్స్‌లర్ జానయ్య అన్నారు. చిలుకూరులోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)ఆధ్వర్యంలో ఈ నెల 4 వరకు జరగనున్న ఎస్‌డబ్ల్యూడబ్ల్యూస్-2025 జాతీయ సదస్సు రెండో రోజు బుధవారం ఆయన పాల్గొన్నారు. ఆవిష్కరణలు, విజయాలకు వయసు అడ్డు కాదన్నారు. సదస్సులో వివిధ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధి దీప్తి, అగ్రికల్చర్ హబ్ ఎండీ వెంకటేశ్వర్లు, సీఈవో సీత, విజయ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై బీజేపీ పోరుబాట

- ప్రభుత్వంపై ఒత్తిడికి ఆచారి ఆధ్వర్యంలో ఆందోళన
- గ్రామ పంచాయతీలలో నిరాహార దీక్ష



ఆమనగల్లు : దీక్షలో కండె హరిప్రసాద్ తదితరులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మాడ్గుల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుకై బీజేపీ పోరుబాట పట్టింది. ప్రభుత్వంపై ఒత్తిడికి నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, కల్వకుర్తి, వెల్దండ మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో బుధవారం నిరాహార దీక్ష చేపట్టింది. బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపు మేరకు నిర్వహించిన ఆయా మండలాలు, గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీజేపీ జెండాలు చేబూని అన్ని గ్రామాలలో ర్యాలీలు నిర్వహించిన అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాలు, గ్రామ ప్రదాన కూడళ్లలో దీక్షలు చేపట్టారు. ఆమనగల్లు గాంధీ చౌక్‌వద్ద బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, జిల్లా నాయకుడు చెక్కాల లక్ష్మణ్‌లు పాల్గొన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లిలో నిర్వహించిన దీక్షలో మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు మహేశ్, తలకొండపల్లి మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు రవిగౌడ్‌ల ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. పలుగ్రామాలలో ఆచారి పాల్గొని దీక్షలను ప్రారంభించి అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఆసరా పింఛన్లు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, రైతు భరోసా రూ.15వేలు, మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు రూ2500, కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం, తెలంగాణ ఉద్యమకారులకు రూ.25 వేలు పింఛన్, చదువుకునే ఆడ పిల్లలకు స్కూటీలు, ఆటోడ్రైవర్లకు రూ.12వేలు జీవనభృతి అందించాలని ఆచారి డిమాండ్ చేశారు. ఆయా చోట్ల జరిగిన దీక్షల్లో బీజేపీ జిల్లా, మండల నాయకులు శ్రీకాంత్ సింగ్, చెన్నకేశవులు, దుడ్డు కృష్ణ, శానమోని పాండు, కృష్ణనాయక్, ఎర్రవోలు మహేశ్, పద్మ అనిల్, యాదయ్య, లక్యనాయక్, రవి రాథోడ్, ప్రశాంత్, తల్లోజు శ్రీను, హరికాంత్, మహేశ్,బాలకృష్ణ, వరికుప్పల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మాడ్గుల మండలంలోని 11 గ్రామాల్లో ఒకరోజు నిరహార దీక్ష నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేష్, బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దయ్య, సీనియర్ సూ దిని శివరాంరెడ్డి, మెట్టు శ్రీను, తదితరులున్నారు.



కడ్తాల : గోవిందాయిపల్లితండాలో మహేశ్, తదితరులు

అర్హులందరికీ రేషన్‌కార్డులు

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీ తెల్ల రేషన్‌కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని కాంగ్రెస్ నాయకులు బొక్క సంజీవరెడ్డి, సౌడపు శేఖర్‌గౌడ్‌లు అన్నారు. మండలంలోని కొత్తగూడలో 40మంది లబ్ధిదారులకు మంజూరు చేసిన రేషన్‌కార్డులను బుధవారం గ్రామ రేషన్ డీలర్ బొక్క వీణ బాల్‌రెడ్డితో కలిసి అందజేశారు.

మహాసభను జయప్రదం చేయాలి

మహేశ్వరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జీ బక్కని రవి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 8న కందుకూరులో నిర్వహించే ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయాలని అన్నారు. మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



జెండాను ఆవిష్కరించిన రాంరెడ్డి, నాయకులు

యాచారం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు మోజార్టీ స్థాయిలో గెలిపించుకునేందుకు కృషి చేయాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తెలుగు దేశం నాయకులు జక్క రాంరెడ్డి, మెట్టు దామోదర్‌రెడ్డిలు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం చౌదర్‌పల్లిలో టీడీపీ జెండాను వారు ఆవిష్కరించారు. మాజీ ఎంపీటీసీ కొంగరి జంగయ్య, సర్పంచ్ గౌర నర్సింహ, నక్క మహేందర్ యాదవ్, కొమ్ము యాదయ్య తదితరులున్నారు.

టీడీపీ కార్యవర్గం

యాచారం మండలంలోని చౌదర్‌పల్లిలో టీడీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు గౌర నర్సింహ తెలిపారు. ఈమేరకు అధ్యక్షుడిగా కొమ్ము యాదయ్య, ఉపాధ్యక్షులుగా గొరిగె బీరప్ప, ముక్కెర యాదయ్య, ప్రధాన కార్యదర్శులుగా గొరిగె మల్లయ్య, ముక్కెర యాద య్య, కోశాధికారిగా కొమ్ము మల్ల య్య, సలహాదారులుగా ముక్కెర రాములు, కొంగర జంగయ్య, సన్నాయిల రాజులను ఎన్నుకున్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయు ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య తో కలిసి కార్మికులు ఎంపీడీవో కుసుమ మాధురికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామికనుగుణంగా రూ.18వేలు, వేతనాలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీల మండల మహాసభ నిర్వహించి కార్మికుల సమస్యలపై చర్చించారు. మండలాధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి పర్వతాలు, కోశాధికారి లక్ష్మణ్ నాయక్, భాగ్య నాయక్, ఉపాధ్యక్షులు దుద్యానాయక్, కార్యదర్శి కవిత, సహ కార్యదర్శి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాతాళగంగ పైపైకి..

(ఐదో పేజీ తరువాయి)

రైతులంతా డీలా పడ్డారు. జూలై, ఆగస్టు నెలలో వర్షాలు దంచికొట్టడంతో వానాకాలం సీజన్ గట్టెక్కింది. సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు తొలగిపోయాయి. జిల్లాలో వేసవిలో సగటు 12.58 మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భజలాలు ఇప్పుడు సగటు 7.43 మీటర్లకు చేరడం గమనార్హం. ఆగస్టు నెలలో దాదాపు నాలుగున్నర మీటర్ల మేర భూగర్భజలాలు పెరగడంతో రైతులు సంబురపడుతున్నారు.

నందిగామలో పైపైకి..

పలు మండలాల్లో భూగర్భజలాలు ఎన్నడూ లేని విధంగా పైకి వచ్చాయి. నందిగామ మండలంలో కేవలం 1.39 మీటర్ల లోతునే భూగర్భజలాలు ఉండడం విశేషం. అలాగే ఆమనగల్‌లో 2.74 మీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ 3.75 మీటర్లు, బాలాపూర్ 3.74 మీటర్లు, చేవెళ్ల 3.79 మీటర్లు, కేశంపేట 3.57 మీటర్లు, కందుకూరు 3.86 మీటర్ల లోతునే భూగర్భజలాలు లభ్యమవుతున్నాయి. అయితే కరువు ప్రాంతాలైన ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, తలకొండపల్లి మండలాలతో పాటు శంకరపల్లి మండలంలో మాత్రం భూగర్భజలాలు ఇంకా అడుగంటే ఉన్నాయి. కాగా, గత ఆగస్టు నెలలో ఈ మండలాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగినా ఇతర మండలాలతో పోలిస్తే వ్యత్యాసం అధికంగానే ఉంది. ఈమేరకు ఇబ్రహీంపట్నం మండలంలో అత్యధికంగా 18.57 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. అదేవిధంగా మంచాలలో 12.14 మీటర్లు, శంకరపల్లి 10.99 మీటర్లు, తలకొండపల్లి 10.88 మీటర్లు, యాచారం 10.64 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి.

చౌదరిగూడ, చేవెళ్లలో అత్యధికంగా...

ఉమ్మడి జిల్లాలో అనేక మండలాల్లో ఆగస్టు నెలలో అనూహ్యంగా భూగర్భజలాలు పెరిగాయి. అత్యధికంగా చౌదరిగూడ మండలంలో 7.99 మీటర్ల మేర భూగర్భజలాలు పెరగడం విశేషం. అలాగే చేవెళ్ల మండలంలో 7.98 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయి. మహేశ్వరం మండలంలో 6.56 మీటర్లు, తలకొండపల్లిలో 6.3 మీటర్లు, షాబాద్‌లో 6 మీటర్లు, శంషాబాద్ 5.47 మీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ 5.39 మీటర్లు, కొత్తూరు 5.42 మీటర్లు, మొయినాబాద్ 5.06 మీటర్ల మేర ఒక్కనెలలో భూగర్భజలాలు పెరిగాయి.

భారీగా వర్షాలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు దంచికొట్టాయి. ముఖ్యంగా గడిచిన 20 రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సగటు కంటే 52శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు జిల్లాలో సగటు 404.4 మి.మీ సగటు వర్షపాతం కురవాల్సి ఉండగా, అంతకు మించి 612.7 మి.మీ వర్షం కురిసింది. దాదాపు అన్ని మండలాల్లో 30శాతానికి మించి అధిక వర్షపాతం నమోదైంది. అత్యధికంగా షాబాద్ మండలంలో 83శాతం వర్షపాతం నమోదైంది. అలాగే కేశంపేటలో 81శాతం, తలకొండపల్లిలో 76శాతం, కొత్తూరులో 70శాతం, మహేశ్వరం 66శాతం, చేవెళ్ల, ఆమనగల్‌లో 62శాతం, నందిగామ ఫరూఖ్‌నగర్‌లో 60శాతం, మంచాలలో 54శాతం, మాడ్గుల, కొందుర్గు, మొయినాబాద్ 53శాతం, శేరిలింగంపల్లిలో 52శాతం అధిక వర్షం కురిసింది.

ఆకట్టుకున్న 'కళా ఉత్సవ్'

శంకర్‌పల్లి/కొత్తూర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందుతుందని శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో బుధవారం కళా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీలను ఆమె ప్రారంభించారు. గెలుపొందిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా రాజశేఖర్, శ్రీనివాస్‌లు వ్యవహరించారు. కొత్తూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి కళా ఉత్సవ్ సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి.



శంకర్‌పల్లి : ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కొత్తూర్ : విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నృత్యాలు, నాటికలు, గానం తదితర పోటీలు నిర్వహించగా.. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. గ్రూప్ డాన్స్‌లో ఎస్వీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి, నాటికలో మెరీడియన్ స్కూల్ విద్యార్థులు రెండో బహుమతి, సోలో డ్యాన్స్‌లో జడ్పీహెచ్ఎస్-కొత్తూర్‌కు చెందిన విద్యార్థిని శిక్షాసింగ్, స్టోరీ టెల్లింగ్‌లో కొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెందిన మేఘన, లిటిల్ ఏంజిల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సాక్షిలు ప్రతిభ చాటారు. హెచ్ఎం రవికుమార్, టీచర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గణేశ్ లడ్డూల చోరీ.. ఐదుగురిపై కేసు

దొంగలను పట్టించిన 'స్నాప్‌చాట్'

ఆదిభట్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గణేశుడి మండపాల వద్ద లడ్డూలు చోరీ చేసిన ఐదుగురిపై కేసు నమోదైన ఘటన ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. జీవనోపాధి కోసం వివిధ ప్రాంతాలను నుంచి తుర్కయంజాల్ మున్సిపల్‌లోని మన్నెగూడలో నివాసం ఉంటున్న పలు కుటుంబాలకు చెందిన యువకులు చోరీకు పాల్పడ్డారు. ఎస్సై సైదయ్య, స్థానికులు కథనం మేరకు.. మన్నెగూడలో నివాసం ఉంటున్న సాయితేజ, శివకుమార్, ప్రవీణ్, రాహుల్, అబూ, మరో ఇద్దరు మైనర్లు కలిసి గణేశ్ మండపాల వద్ద చోరీ చేసిన లడ్డూ తినేవారు. ఈక్రమంలో సాయితేజ మరో యువకుడు మన్నెగూడలోని ఎస్ఎస్ఆర్ కాలనీ రోడ్డు నెంబర్ 3లోని స్వామి వివేకానంద యూత్, మహోనియా ఆసుపత్రి వెనకాల ఉన్న మరో గణేశ్ మండపం, ఎంఎం కుంట వెంకట్రాది టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన మండపాల్లో ఉన్న లడ్డూలను సాయితేజ, శివకుమార్ అనే యువకులు చోరీ చేసి స్నేహితులు ప్రవీణ్, రాహుల్, అబూ మరో ఇద్దరు మైనర్లతో కలిసి తిన్న వీడియోను సాయితేజ తన స్నాప్‌చాట్‌లో అప్‌లోడ్ చేశాడు. దాంతో ఆ వీడియోను స్థానికులు చూశారు. మండపాల వద్ద లడ్డూ పోయినట్లు నిర్వాహకులు ఆ యువకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు సాయితేజను పట్టుకొని విచారించగా లడ్డూను దొంగలిచినట్లు ఒప్పుకోవడంతో ఐయిదుగురిని అదుపులోకి తీసుకని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదయ్య బుధవారం మీడియాకు వెల్లడించారు.

అక్రమంగా మట్టి తరలింపు.. టిప్పర్లు సీజ్

ఆదిభట్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు డిప్పర్లను సీజ్ చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. రావిరాల, నాదర్‌గుల్ సమీపంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మాజీ సర్పంచ్‌కు స్పీకర్ పరామర్శ



రాచన్నను పరామర్శిస్తున్న ప్రసాద్‌కుమార్

శంకర్‌పల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కల్కోడ మాజీ సర్పంచ్ రాచన్నను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం పరామర్శించారు. మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన రాచన్న.. శంకర్‌పల్లిలోని గాయత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, స్పీకర్ రాచన్నను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. రాచన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవిందర్, మర్పల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగదీశ్వర్‌లు ఉన్నారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కేశంపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలంటూ తొమ్మిది రేకుల రైతులు బుధవారం కేశంపేట తహసీల్దార్ అజంఅలీకి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో భాగంగా మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 34 నుంచి 37, 40 నుంచి 47, 54 నుంచి 59, 65, 70, 76, 84 నుంచి 88, 106 నుంచి 110, 111, 113, 115, 116, 117, 118, 122, 127, 128, 129, 130 నుంచి రీజినల్ రింగ్ రోడ్‌ను వేయాలని ప్రాథమికంగా అంచనాకు వచ్చిందని వివరించారు. తమ గ్రామంలోని రైతులు వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారి పరిస్థితిని అర్థం చేసుకొని అలైన్‌మెంట్ మార్చాలని వినతిపత్రంలో కోరారు.

ఆశాలకు కనీస వేతనాలు ఇవ్వాలి

కొత్తూర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశాలు నిర్వహించిన మండల మహాసభకు సాయిబాబా హాజరై మాట్లాడారు. ఆశాలకు కనీస వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆశాల నూతన కమిటీని సాయిబాబా ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా బుజ్జి, కోశాధికారిగా నవనీత, సహాయ కార్యదర్శులుగా అనిత, జంగిర్‌బీ, ఉపాధ్యక్షురాళ్లుగా ఇందిర, వసంత, సభ్యులుగా లక్ష్మి, కవిత, మహేశ్వరి, లక్ష్మీశ్రీవాణి, కమల, అనితలను ఎన్నుకున్నారు.


బీజేపీని ఆదరించండి

కేశంపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీని ఆదరించాలని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్ కోరారు. మండల పరిధిలోని కొత్తపేటలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు మోదీపై విశ్వాసంతో ఉన్నారని, దేశ హితం కోసం ఆయన చేస్తున్న అన్ని పనులకు విశేషంగా మద్దతు వస్తుందని వివరించారు. కాంగ్రెస్ ప్రజల నమ్మకాన్ని ఎప్పుడో కోల్పోయిందని తెలిపారు. మండల ఎన్నికల కన్వీనర్ కంచుకోట మహేష్, ప్రధాన కార్యదర్శులు తిరుపతి, నరసింహ, శ్రీనివాస్, కుమారస్వామి గుప్తా, యాదగిరి గౌడ్, పాండు, పవన్ కుమార్ రెడ్డి, జగన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి

షాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): యువత స్వశక్తితో ఎదిగి పదిమందికి ఉపాధి కల్పించేస్థాయిలో ఉండాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదనరెడ్డి అన్నారు. షాబాద్‌లో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఓ టిఫిన్ సెంటర్‌ను గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, సర్పంచులు జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, మహేందర్‌గౌడ్, నాయకులు రాహుల్‌గుప్తా, ప్రభాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, సూర్యగౌడ్, విక్రమ్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్, కిషోర్ తదితరులున్నారు.

డాక్టరేట్ పొందిన వెంకటేశ్‌కు సన్మానం



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న పీవీఆర్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలన శాస్త్రంలోని పంచాయతీ రాజ్ అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పొందిన బీజేపీ ఫరూఖ్‌నగర్ మండల శాఖ మాజీ అధ్యక్షుడు దొడల వెంకటేశ్ యాదవ్‌ను బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి సన్మానించి అభినందించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్లకు చెందిన దొడల వెంకటేశ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యాభ్యాసం చేయాలని ఆయన సూచించారు. నాయకులు సుధాకరప్ప, అనిల్‌కుమార్‌గౌడ్‌లు ఉన్నారు.

ఆ భూమిని జీపీ భవనానికి కేటాయించాలి

(ఐదో పేజీ తరువాయి)

శ్మశానవాటికకు ప్రభుత్వ భూమిని ఎలా కేటాయించారని తండావాసులు మండిపడుతున్నారు. నూతనంగా ఏర్పడిన కొడిచర్లతండా గ్రామపంచాయతీకి భవనం లేక తండావాసులు, అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం స్థానిక పాఠశాలలో ఒక గదిని తీసుకుని కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ భూమిని గ్రామ పంచాయతీకి కేటాయించాలే తప్పా, శ్మశాన వాటికకు ఎలా కేటాయిస్తారంటూ తండావాసులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఇటీవల మాజీ ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంతోష్‌నాయక్ ఆధ్వర్యంలో తండావాసులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, షాద్‌నగర్ ఆర్డీవో ఎస్ ఆర్ సరిత, కొత్తూర్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డిలకు వినతి పత్రాలు అందజేసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఇందుకు వారి నుంచి సానుకూల స్పందన వచ్చిందని మాజీ ఎంపీటీసీ పేర్కొన్నారు. శ్మశానవాటికకు కేటాయించిన భూమిని రద్దు చేసి గ్రామపంచాయతీ కార్యాలయ భవనానికి కేటాయించాలని తండావాసులు కోరుతున్నారు.

జీపీ భవనానికి కేటాయించాలి



నూతనంగా ఏర్పడిన కొడిచర్లతండా గ్రామపంచాయతీకి భవనం లేక పాఠశాలలోని ఓ గదిలో కార్యాలయాన్ని నడుపుతున్నారు. దాంతో తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ భూమిని జీపీకి కేటాయించాలి.

- బిచ్యానాయక్, కొడిచర్లతండా

ప్రభుత్వ ఆదేశాలతోనే కేటాయింపు



2019 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ ఆదేశాలతోనే రెవెన్యూ అధికారులు శ్మశానవాటికకు భూమిని కేటాయించారు. సర్వే కూడా పూర్తయ్యింది.

- రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూర్

ఐలమ్మ పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

కడ్తాల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట పటిమ అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలం రావిచెడ్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 8న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారు. విగ్రహావిష్కరణకు సంబంధించిన ఆహ్వానపత్రికను రజక సంఘం అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్,ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు రవికుమార్, పాండు,రమేశ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో స్తంభాల ఏర్పాటు

తలకొండపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 9వ వార్డులో రెండు దశాబ్దాలుగా ఉన్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు సమస్యను ఎమ్మెల్యే నారాయణరెడ్డి దృష్టికి స్థానిక కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించారు. బుధవారం 9వ వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. నర్సింహారెడ్డి, బొల్ల యాదగిరి ముదిరాజ్, తదితరులున్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్ మృతి పట్ల నివాళి



వెంకట్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గంప వెంకటేశ్

కడ్తాల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి మృతిపట్ల డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు సంతాపం తెలిపారు. వెంకట్‌రెడ్డి మృతి రైతులకు తీరని లోటని పేర్కొన్నారు. కడ్తాల మండలం ముద్విన్‌కు చెందిన శ్రీపాతి వెంకట్‌రెడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం ముద్విన్ పీఏసీఎస్ సబ్ సెంటర్ వద్ద వెంకట్ రెడ్డికి సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్లు వెంకటేశ్, వెంకటయ్య, సేవ్యానాయక్, అంతిరెడ్డి, జంగమ్మ, సీఈవో దేవేందర్, సిబ్బంది పద్మాకర్ రెడ్డి, అల్లాజీ, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, నర్సింహ, నాయకులు వినోద్, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కృషి

మంచాల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కృషి చేస్తోందని కాంగ్రెస్ జిల్లా నేత రమాకాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి రంగాపూర్-నల్లవెల్లి మధ్య 12 కిలోమీటర్ల మేర రహదారి డబుల్‌రోడ్డు విస్తరణకు రూ.9 కోట్లు మంజూరయ్యాయి. బుధవారం మంచాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్లు గీత కార్మిక సహకార సంఘం కార్యవర్గం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శేరిగూడ, మల్‌శెట్టిగూడ కల్లు గీత కార్మిక సహకార సంఘానికి బుధవారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్ల శ్రీశైలంగౌడ్, ఉపాధ్యక్షులుగా వర్కాల శ్రీరాములుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కాకి ఆంజనేయులుగౌడ్, డైరెక్టర్లుగా పండాల శ్రీనివాస్‌గౌడ్, పిరంగి వెంకటేష్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

విఘ్నేశుడికి విశేష పూజలు

నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈమేరకు ఉత్సవ కమిటీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు గణపయ్యను దర్శించుకున్నారు. కొన్ని చోట్ల వినాయక నిమజ్జనాలు చేశారు.



షాద్‌నగర్‌లోని ఏబీ విల్లాస్ వద్ద వినాయకుడిని దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ



నందిగామ : చాకలిగుట్ట తండా విగ్రహం వద్ద పూజలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు



కందుకూరు : అన్నదాన కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



షాబాద్ : మల్లారెడ్డిగూడలో నిమజ్జనానికి తరలిన గణేశుడు



ఆమనగల్లు : శివశక్తి వినాయక మండపం వద్ద సామూహిక కుంకుమార్చన